క్లుప్తంగా

బండలాగుడు పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న ఎస్‌ఐ రమేష్‌బాబు

మద్దికెర: గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే వృషభాల బండలాగుడు పోటీలు, భజన పోటీలు ప్రజల్లో ఐకమత్యాన్ని పెంచుతాయని ఎస్‌ఐ రమేష్‌బాబు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఎడవలి గ్రామంలో తిమ్మప్ప స్వామి రథోత్సవం సందర్భంగా వృషభాల బండలాగుడు పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. పోటీలను శాంతియుతంగా నిర్వహించాలన్నారు. ఇలాంటి పోటీలు ఎంతో ఉల్లాసాన్ని ఇస్తాయన్నారు. గ్రామస్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

విద్యాశాఖ డైరెక్టర్ కొనసాగింపు



నిజాల్ రెడ్డి

దేవనకొండ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్య, సంక్షేమ, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ డైరెక్టర్‌గా మండలంలోని మాచాపురం గ్రామానికి చెందిన ఆర్.రామాంజనేయరెడ్డి అలియాస్ నిజాల్ రెడ్డిని కొనసాగిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన పదవీ కాలం ఇటీవల ముగియడంతో మళ్లీ కొనసాగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ సందర్భంగా నిజాల్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యారంగ సమస్యలపై తన వంతుగా కృషి చేస్తానని చెప్పారు.

నేడు కమ్యూనిటీ హాలు ప్రారంభోత్సవం



మైనారిటీ కమ్యూనిటీ హాలు భవనం

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో రూ. 30 లక్షలతో నిర్మించిన మైనారిటీ కమ్యూనిటీ హాలు భవనాన్ని శనివారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి చేతులమీదుగా ప్రారంభించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు రామలింగారెడ్డి, మోహన్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

సేవలు విస్తృతం చేయండి



నాగలదిన్నెలో సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ కిరణ్‌మోహన్‌రావు

నందవరం: గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ సచివాలయ సేవలు విస్తృతం చేయాలని ఎంపీడీఓ కిరణ్‌మోహన్‌రావు సిబ్బందికి సూచించారు. ఆయన శుక్రవారం నాగలదిన్నెలోని సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలతో డాష్ బోర్డులను ప్రదర్శించాలని సూచించారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలన్నారు. ఆరోగ్య శ్రీ కార్డులను లబ్ధిదారులకు తప్పనిసరిగా అందించాలని సూచించారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి



విద్యార్థులను అభినందిస్తున్న డీఈఓ శ్యామ్యూల్

మద్దికెర: విద్యార్థులు ఉపాధ్యాయులు బోధించిన పాఠాలు శ్రద్ధగా విని వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా విద్యాశాఖాధికారి శ్యామ్యూల్ సూచించారు. ఆయన శుక్రవారం మద్దికెరలోని ఆదర్శ పాఠశాలను సందర్శించారు. చదువులో చురుగ్గా రాణిస్తున్న పదో తరగతి విద్యార్థులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రతిభను గుర్తించి మరింత మెరుగైన విద్య అందించేందుకు తమ వంతు కృషి చేయాలన్నారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికలు తయారుచేసి విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలన్నారు. తరగతి గదుల్లో డిజిటల్ బోధన, ట్యాబ్‌ల ఉపయోగం గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. సమగ్ర శిక్ష ఏపీసీ జ్యోతికుమారి, ఎంఈఓ రంగస్వామి, ప్రిన్సిపాల్ సవిత ఉన్నారు.

అర్హులైన రైతుల జాబితా ప్రదర్శన

హాలహర్వి: మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో రబీ సీజన్‌లో సాగయిన శనగ, జొన్న, తదితర పంటలకు ఈ–క్రాప్ చేయించుకున్న అర్హులైన రైతుల జాబితాను ప్రదర్శించినట్లు ఏఓ శివశంకర్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మండలంలోని సిద్దాపురం, గూళ్యం–1, 2, 3 రైతు భరోసా కేంద్రాలను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ క్రాప్ బుకింగ్ చేయించుకున్న రైతులకు పంట నష్టపరిహారం, ఇతర ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని చెప్పారు. ప్రతిరైతు ఈ–కేవైసీ చేయించుకోవాలని సూచించారు. ఆర్‌బీకే సిబ్బంది ఉన్నారు.

ఠంచన్‌గా పింఛన్

- మొదటి రోజు 88 శాతం మందికి పంపిణీ
- నియోజకవర్గంలో 34,902 మంది లబ్ధిదారులు
- హర్షం వ్యక్తం చేస్తున్న అవ్వాతాతలు



చిట్యాలలో మాల అంజినమ్మ, ఉలువ మద్దమ్మకు వితంతు పింఛన్ అందిస్తున్న వలంటీర్ రాజు



హులేబీడులో దివ్యాంగుడు మల్లికార్జునకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ మల్లేష్

ఆలూరు రూరల్: ప్రతి నెలా నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం అందించే పింఛన్ల పంపిణీ ఎప్పటిలాగే ఠంచనుగా ప్రారంభమైంది. వలంటీర్లు శుక్రవారం తెల్లవారుజాము నుంచే పంపిణీ మొదలుపెట్టారు. ప్రతి లబ్ధిదారుడి ఇంటి తలుపు తట్టి నగదు అందజేశారు. గురువారం అర్ధరాత్రి 12 గంటల తరువాత వెబ్‌సైట్ ఓపెన్ కావడంతో నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో వలంటీర్లు పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. ఉదయం 6 గంటల్లోపు 88 శాతం పంపిణీ పూర్తి చేసినట్లు ఆయా మండలాల ఎంపీడీఓలు వెల్లడించారు. ఇంటి వద్దకే పింఛన్ అందించే వెసులబాటు కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. శనివారం మధ్యాహ్నంలోపు వంద శాతం పంపిణీ పూర్తి చేస్తామని అధికారులు చెప్పారు. గత టీడీపీ హయాంలో పింఛన్ తీసుకొనేందుకు పడిన నరకయాతన తలచుకుని, ప్రస్తుతం ఇంటివద్దనే పింఛన్ అందుకున్న లబ్ధిదారు లు జగనన్న పాలనపై సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

34,902 మందికి మంజూరు

వైఎస్సార్ పింఛన్ కానుక లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరుగుతోంది. దరఖాస్తు చేసుకున్న వెంటనే వివరాలన్నీ పరిశీలించి, పార్టీలకతీతంగా అర్హులకు పింఛన్ అందేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. నియోజవకర్గంలోని ఆరు మండలాల్లో 34,902 మంది లబ్ధిదారులు ప్రతి నెలా పింఛన్ నగదు అందుకుంటున్నారు. జనవరి నుంచి పింఛన్ సొమ్ము రూ.250 పెంచి రూ.3 వేలు చేయడంతో నియోజవర్గానికి ప్రతి నెలా అదనపు లబ్ధి చేకూరుతోంది.

చిట్యాలలో 75 శాతం పింఛన్ల పంపిణీ

కృష్ణగిరి: మార్చి నెలకు సంబంధించి మొదటి రోజు శుక్రవారం రాత్రి 7 గంటలకల్లా 75 శాతం పింఛన్ల పంపిణీ పూర్తిచేసినట్లు ఎంపీడీఓ రాబర్ట్ విల్సన్ తెలిపారు. ఇంటి వద్దకే పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్ల సమన్వయంతో లబ్ధిదారులకు సకాలంలో అందించేలా చర్యలు తీసుకున్నామని వెల్లడించారు.

తుగ్గలి: ప్రతి నెలా 1వ తేదీ వచ్చిందంటే అవ్వాతాతల్లో పింఛనోత్సాహం తొణికిసలాడుతోంది. మండలంలోని లబ్ధిదారులకు శుక్రవారం తెల్లవారుజామునే పింఛన్ల పంపిణీ ప్రారంభమైంది. వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ సొమ్ము అందజేశారు. మండలంలో 7,818 మంది పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉండగా మొదటిరోజు సాయంత్రం 6 గంటలకు 4,767 మందికి పింఛన్ సొమ్ము అందించి 60.97 శాతం పూర్తిచేశారు.

చిప్పగిరి: మడలంలోని ఆయాగ్రామాల్లో వేకువజామునే వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ సొమ్ము పంపిణీ చేశారు. మొత్తం 3,552 మందికి రూ.97,76,250 పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ బరెన్ సాహెబ్ తెలిపారు.

చెప్పాడంటే చేస్తాడంతే



సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఏదైనా చెబితే తప్పకుండా చేస్తారు .గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేశారు. పింఛన్ నగదు చెప్పినట్లే పెంచారు. జనవరి నుంచి రూ.3 వేలు పింఛన్ అందిస్తూ మాట నిలబెట్టుకున్నారు. జనమంతా మళ్లీ జగనన్నే సీఎం కావాలని కోరుకుంటున్నారు. మా ఆశీసులు వైఎస్ జగన్‌కు ఉంటాయి.–**శేషమ్మ, వితంతు పింఛన్‌దారు, సిద్దాపురం గ్రామం, హాలహర్వి మండలం**

విజేత గంగన్నపాలెం వృషభాలు

దేవనకొండ: మండలంలోని కొత్తపేట మస్తాన్‌వలి స్వామి ఉరుసులో భాగంగా శుక్రవారం వృషభాల బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. ఈ పోటీల్లో విజేతగా యూఎస్ బుల్స్ గంగన్నపాలెం వృషభాలు (ఒంగోలు జిల్లా), తరువాతి స్థానాల్లో అనన్యారెడ్డి వృషభాలు (నాగర్‌కర్నూలు జిల్లా), కోరల గిరిజ వృషభాలు (పగిడ్యాల, నంద్యాల జిల్లా), జానకిరాముడు వృషభాలు (సి.బెళగల్ మండలం), జే బుల్స్ జల్లి ధనుంజయ వృషభాలు (పుచ్చకాయలమాడ, పత్తికొండ మండలం), పాలేగార్ రంగస్వామి వృషభాలు (పత్తికొండ) నిలిచాయని కమిటీ సభ్యులు గిడ్డయ్యనాయుడు, రామానాయుడు తెలిపారు. వారికి వరుసగా రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు చొప్పున నగదు బహుమతులను అందజేశారు.

నేడు భవనాల ప్రారంభోత్సవం

తుగ్గలి: మండల పరిధిలోని పెండేకల్లులో శనివారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పాల్గొంటారని సింగిల్ విండో అధ్యక్షుడు అట్ల గోపాల్‌రెడ్డి తెలిపారు.నూతనంగా నిర్మించిన ఆర్‌బీకే, సచివాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభిస్తారన్నారు. ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

6న మండల సర్వసభ్య సమావేశం

చిప్పగిరి: ఈ నెల 6న స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఉదయం 11గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బరెన్ సాహెబ్ శుక్రవారం తెలిపారు.అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలతో హాజరుకావాలన్నారు.

ప్రజల చెంతకే సుపరిపాలన



పోనకలదిన్నెలో గ్రామ సచివాలయం-1 శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి

నందవరం: జాతిపిత మహాత్మా గాంధీజీ కన్న కలలను సాకారం చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజల చెంతకే పాలన తీసుకొచ్చారని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పేర్కొన్నారు. ఆయన శుక్రవారం మండల పరిధిలోని పోనకలదిన్నె గ్రామంలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం శిలాఫలాకాలను ఆవిష్కరించారు. అనంతరం గ్రామ సర్పంచ్ పావని, ఎంపీటీసీ జైపాల్‌రెడ్డితో కలిసి నూతన భవనాలను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామ సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశానికే ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఈ వ్యవస్థల ద్వారా ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో కుల, మత, రాజకీయ, పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని గుర్తుచేశారు. అవినీతి రహిత పాలన సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని పేర్కొన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, పంటల బీమా, వ్యవసాయ పనిముట్లు, సబ్సిడీ విత్తనాలతో పాటు వ్యవసాయ సలహాలు, సూచనలు అందుతున్నాయన్నారు. సంక్షేమ పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగనన్నకు అండగా నిలుద్దామని, ఎమ్మిగనూరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీకాంత రెడ్డి, మండల కన్వీనర్ శివారెడ్డి గౌడ్, వైఎస్సార్‌సీపీ నియోజకరవర్గ బీసీ సెల్ అధ్యక్షులు, ముగతి గ్రామ సర్పంచ్ విరుపాక్షి రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చాంద్‌బాషా, నాయకులు ప్రకాష్ రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, నాగరాజు, రామచంద్రరెడ్డి, పీఆర్ డీఈఈ చంద్రశేఖర్, ఏడీఏ మహమ్మద్ ఖాద్రి, ఎంపీడీఓ కిరణ్‌మోహన్‌రావు, పీఆర్ ఏఈ జయన్న, ఏఓ స్రవంతి తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి

పేదల సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం

ఎమ్మిగనూరుటౌన్: ప్రతి పేదవాడికి సొంతిల్లు ఉండాలన్న సంకల్పంతో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి రాగానే ఇంటి స్థలాలు ఇచ్చి వాటిని ఉచితంగా లబ్ధిదారుల పేరిట రిజిస్ట్రేషన్ చేసి ఇస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి కొనియాడారు. శుక్రవారం పట్టణంలోని తన నివాసంలో నందవరం గ్రామానికి చెందిన లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలను వైఎస్సార్‌సీపీ జిల్లాప్రధాన కార్యదర్శి లక్ష్మీకాంతరెడ్డి, నందవరం మండల కన్వీనర్ శివప్పగౌడ్, ముగతి గ్రామ సర్పంచ్ విరూపాక్షిరెడ్డితో కలిసి అందజేశారు. నందవరం తహసీల్దార్ ఓబులేసు, వైఎస్సార్‌సీపీ నాయకులు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం



పెద్దహోతూరులో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ఆలూరు రూరల్: ప్రజల మెరుగైన ఆరోగ్యమే ప్రభుత్వం లక్ష్యమని మొలగవల్లి పీహెచ్‌సీ డాక్టర్ రవి అన్నారు. ఆయన శుక్రవారం సిబ్బందితో కలిసి పెద్దహోతూరు గ్రామ సచివాలయలం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష–2 కార్యక్రమం నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. వృద్ధులు, గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. దీర్ఘకాలిక రోగులకు రక్త, మూత్ర పరీక్షలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. శిబిరంలో 532 మందికి వైద్య సేవలందించినట్లు తెలిపారు. ఎంఎల్‌పీహెచ్‌లు, ఏఎన్‌ఎంలు, సచివాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

పేదల ఆరోగ్యానికి భరోసా

కృష్ణగిరి: మండల పరిధిలోని ఎస్‌హెచ్ ఎర్రగుడి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సర్పంచ్ గిరిబాబు, ఎంపీడీఓ రాబర్ట్ విల్సన్ పర్యవేక్షించారు. ఈ శిబిరంలో స్పెషలిస్ట్ వైద్యులు 431 మందికి ఆరోగ్య పరీక్షలు చేసి ముందులు అందజేసినట్లు వైద్యాధికారి ప్రదీప్ తెలిపారు. కార్యదర్శి మస్తాన్, నారాయణరెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ఎస్‌హెచ్ ఎర్రగుడి శిబిరంలో ఓపీ నమోదు చేయించుకుంటున్న ప్రజలు

పోలియో మహమ్మారిని నివారిద్దాం



అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న కమిషనర్ గంగిరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: పోలియో మహమ్మారిని తరిమికొట్టేందుకుగాను ఐదేళ్ల లోపు చిన్నారులకు పల్స్‌పోలియో చుక్కలను వేయించాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్ పేర్కొన్నారు. ఆదివారం నిర్వహించనున్న పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం అర్బన్ హెల్త్ సెంటర్ల వైద్యులు, సిబ్బందితో కలిసి స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి అవగాహ ర్యాలీ నిర్వహించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించి పోలియో రహిత పట్టణంగా మార్చేందుకు సహకరించాలన్నారు.

వెల్దుర్తి(కృష్ణగిరి): ఈనెల 3వ తేదీ పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఎంపీడీఓ శివశంకరప్ప పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన తన కార్యాలయంలో మండల పరిధిలోని రామళ్లకోట, గోవర్ధనగిరి పీహెచ్‌సీల వైద్యాధికారులు భువనతేజ, పవన్‌కుమార్‌లతో కలిసి అవగాహన పోస్టర్లను విడుదల చేశారు. మండలవ్యాప్తంగా ఐదేళ్లలోపు చిన్నారులు 6476 మందికి పోలియో చుక్కలు వేసేందుకు 41 గ్రామాలలో 59 కేంద్రాలు సిద్ధం చేశామన్నారు.

దేవనకొండ: స్థానిక పీహెచ్‌సీలో వైద్యాధికారి విజయభాస్కర్ ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలు, సూపర్‌వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పీలతో సమావేశమయ్యారు. పోలియో చుక్కల కార్యక్రమం విజయవంతం చేయడంపై పలు సూచనలు చేశారు.

తుగ్గలి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం తహసీల్దార్ షర్మిల పల్స్ పోలియో చుక్కల అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. తుగ్గలి పీహెచ్‌సీ పరిధిలో 3,681, పగిడిరాయి పరిధిలో 3,614 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని వంద శాతం పూర్తి చేయాలన్నారు.

పార్టీలకు అతీతంగా సీఎం రిలీఫ్‌ఫండ్ సాయం



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పత్తికొండటౌన్: పార్టీలకు అతీతంగా బాధిత కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి ఆర్థిక సాయం అందిస్తున్నట్లు ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి తెలిపారు. శుక్రవారం పత్తికొండలో 16 మంది బాధిత కుటుంబ సభ్యులకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.26.66 లక్షల చెక్కులను ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పంపిణీ చేశారు.

ఆర్థిక సాయం మంజూరైన వారి వివరాలు

➤ బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పెరవలి ఈడిగ రంగాగౌడ్ గత ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆ పార్టీ తరఫున పోటీచేశారు. ఆయన కొన్ని నెలల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. నా కుటుంబానికి సీఎం రిలీఫ్‌ఫండ్ కింద రూ.3 లక్షలు మంజూరయ్యాయి.

➤ చెరుకులపాడుకు చెందిన షేక్ బాషా పాముకాటుతో మృతిచెందగా భార్య రేష్మాకు రూ.2లక్షలు, మద్దికెరకు చెందిన చాకలి వెంకటేశ్‌కు చెందిన రెండు ఎద్దులు హంద్రీ కాలువలో కొట్టుకుపోగా రూ.లక్ష, పెండేకల్లుకు చెందిన ఇండ్ల ప్రతాప్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిగా ఆయన భార్య సుశీలమ్మకు రూ.2 లక్షలు, పెద్దహుల్తికి చెందిన సంజీవ రెడ్డి గుండెపోటుతో చనిపోగా ఆయన భార్య పుష్పలతకు రూ.2 లక్షలు, రామళ్లకోటకు చెందిన బాలయ్య రోడ్డు ప్రమాదంలో చనిపోగా ఆయన భార్య పుణ్యవతికి రూ.2 లక్షలు, చెరుకులపాడుకు చెందిన శ్రీనివాసులు రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా భార్య రామాంజులమ్మకు రూ.2 లక్షలు, అగ్రహారం గ్రామానికి చెందిన విజయ్ అప్పుల బాధతో చనిపోగా భార్య విజయలక్ష్మికి రూ.2 లక్షలు మంజూరయ్యాయి.

అలాగే ముత్యాల భూషణం–వెల్దుర్తి–రూ.1.20 లక్షలు, పల్లె చార్లెస్ దేవరాజు – పత్తికొండ–రూ,1.10 లక్షలు, హనుమన్న– పత్తికొండ–రూ.1.60 లక్షలు, గోమసాని కృష్ణమూర్తి– కృష్ణగిరి–రూ.26 వేలు, నరసాపురం శివకేశవరెడ్డి–రూ.1.70 లక్షలు, రామకొండ చంద్రశేఖర్ రెడ్డి–రూ.1.50 లక్షలు, బింగిదొడ్డి రిత్విక్ రెడ్డి – రూ.2 లక్షలు, వెల్దుర్తి రేనాటి రమణారెడ్డి– రూ.2 లక్షలు చొప్పున మంజూరయ్యాయి.

కార్యక్రమంలో ఎంపీపీ నారాయణదాసు, వైస్ ఎంపీపీ మల్లికార్జునరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ అట్ల గోపాల్‌రెడ్డి, నాయకులు కారం నాగరాజు, పెద్దహుల్తి నాగరాజు, డీఎస్ యాదవ్, కృష్ణ, ఉమామహేశ్వరరెడ్డి, బసిరెడ్డి, తమ్మిరెడ్డి పాల్గొన్నారు.

ప్యాసింజర్ రైళ్లకు తగ్గిన చార్జీలు

మద్దికెర: కేంద్ర ప్రభుత్వం కరోనా సమయంలో ప్యాసింజర్, డెమో రైళ్లను ఎక్స్‌ప్రెస్‌గా మార్చి పెంచిన చార్జీలను ప్రస్తుతం తగ్గించినట్లు స్థానిక రైల్వే స్టేషన్‌మాస్టర్ ఎస్‌ఎస్ పరమేశ్వరరెడ్డి శుక్రవారం తెలిపారు. మద్దికెర నుంచి డోన్‌కు రూ.35గా ఉన్న చార్జీని రూ.10కి, కర్నూలుకు రూ.55 నుంచి రూ.25లకు, కాచిగూడకు రూ.125 నుంచి రూ.75కు తగ్గించడం జరిగిందన్నారు. ఈ చార్జీలు ప్యాసింజర్, డెమో రైళ్లకు మత్రమే వర్తిస్తాయన్నారు. ప్రయాణికులు గమనించాలని కోరారు.

కొత్తపేటలో డ్రైడే–ఫ్రైడే

దేవనకొండ: మండలంలోని కొత్తపేట గ్రామంలో శుక్రవారం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, మలేరియా అధికారి సాయిబాబా ఆధ్వర్యంలో డ్రైడే–ఫ్రైడే కార్యక్రమం నిర్వహించారు. మురుగు కాలువలను పంచాయతీ సిబ్బంది చేత శుభ్రం చేయించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ప్రజల ఇంటి పరిసరాలను పరిశీలించారు. ఇళ్లల్లో ఎక్కువ కాలం నీటిని నిల్వ ఉంచుకోరాదని, నీరు నిల్వ ఉన్న చోట దోమలు ఉంటాయని మలేరియా అధికారి చెప్పారు. రాత్రివేళల్లో దోమకాటుకు గురికాకుండా ప్రజలు దోమతెరలను వాడాలని సూచించారు. పీహెచ్‌సీ సూపర్‌వైజర్లు రంగస్వామి, శ్రీధర్, జయలక్ష్మి, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఎలక్ట్రీషియన్ పోస్టు ఖాళీ

మద్దికెర: మద్దికెర పంచాయతీలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేసేందుకు అనుభవం గల ఎలక్ట్రీషియన్ కావాలని పంచాయతీ సలహాదారు బండారు ఆంజనేయులు శుక్రవారం తెలిపారు. పంచాయతీ పరిధిలో ఉన్న వీధి బల్బులు మార్చేందుకు, కొత్తవి వేసేందుకు ఎలక్ట్రీషియన్ కావాలని, ఆసక్తి గల వారు పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని సిరాలదొడ్డి గ్రామంలో శుక్రవారం సాయంత్రం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో దస్తగిరి అనే వ్యక్తికి చెందిన గుడిసె దగ్ధమైంది. గుడిసెలో ఎవరూ లేని సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో లోపలి నుంచి పొగలు వెలువడ్డాయి. చుట్టుపక్కల వారు గమనించేలోగా మంటలు ఏర్పడ్డాయి. మంటలను ఆర్పేందుకు నీటిని చల్లుతూ అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. కొద్దిసేపటికి అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపుచేశారు. అప్పటికే గుడిసె పూర్తిగా కాలిపోవడంతో ఇంట్లోని వస్తువులు, సామగ్రి బూడిదయ్యాయి. రూ.2 లక్షల వరకు ఆస్తినష్టం జరిగినట్లు బాధితుడు దస్తగిరి వాపోయారు. కట్టుబట్టలతో రోడ్డున పడ్డామని ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

విద్యార్థులచే పనిచేయిస్తే చర్యలు

ఆలూరు: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులచేత పనులు చేయిస్తున్నట్లు తేలితే ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటామని ఆలూరు ఎంఈఓ కోమలాదేవి హెచ్చరించారు. మండలంలోని మొలగవెల్లి గ్రామ జెడ్పీ హైస్కూల్లో చిన్నారులచే పనిచేయిస్తున్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో ఆమె శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నాడు–నేడు నిధులతో కొనుగోలు చేసిన స్టీల్ (ఐరన్) కడ్డీలు, ఇసుక, సిమెంట్ తదితర వాటిని పరిశీలించారు. రికార్డులు పక్కాగా నిర్వహించాలని, పనులు సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు.

పేదలకు ‘పట్టా’భిషేకం



లబ్ధిదారులకు ఇంటి స్థలం రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: సీఎం వైఎస్ జగనన్న ఇచ్చిన హామీ మేరకు నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా ఇళ్ల స్థలాలు ఇవ్వడమే కాకుండా వారి పేరిటపై ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి పత్రాలు అందించడం జరుగుతుందని స్థానిక 32వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ కోటకొండ నరసింహులు, 15వ వార్డు కౌన్సిలర్ ఇషాక్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆయా 24, 15వ వార్డు సచివాలయాల్లో లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశారు. రిజిస్ట్రేషన్ పూర్తికావడంతో లబ్ధిదారులకు ఇంటి స్థలంపై సర్వహక్కులు లభిస్తాయన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ అవినీతికి ఆస్కారం లేకుండా ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తున్న ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

‘ఆదర్శ’ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఆలూరు రూరల్: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో ఆరవ తరగతిలో ప్రవేశాల కోసం విద్యాశాఖ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఆలూరు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రాఘవ రావు శుక్రవారం తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరంలో 6వ తరగతి చదివేందుకు అర్హులైన విద్యార్థులు ఈ నెల 3 నుంచి 31వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 21న 5వ తరగతి సిలబస్‌తో తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశ పరీక్ష ఉంటుందని వెల్లడించారు. ఓసీ, బీసీ విద్యార్థులు 01.9.2012 నుంచి 31.08.2014 మధ్య జన్మించిన వారు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 01.09.2010 నుంచి 31.08.2024 మధ్య జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష కోసం ఓసీ, బీసీ విద్యార్థులు రూ.150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75 ఫీజు చెల్లించాలని, www.cse.ap.gov.in, https://apms.apcfss.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అక్రమ మద్యంపై నిఘా

ఆలూరు: అక్రమంగా కర్ణాటక మద్యం తరలింపు, విక్రయాలు సాగించే వారిపై నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకుంటామని ఆలూరు సెబ్ సీఐ డి.సోమశేఖర్ హెచ్చరించారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ.. హాలహర్వి, హొళగుంద గ్రామాల్లో సాటుసారా తయారీ, కర్ణాటక మద్యం విక్రయాలను అరికట్టేందుకు తనిఖీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఎన్నికల సందర్భంగా ప్రత్యేక సెబ్ బృందాలచే దాడులు నిర్వహించి అసాంఘిక కార్యకలాపాలను అడ్డుకుంటామన్నారు. గ్రామాల్లో ఎవరైనా నాటుసారా, అక్రమ మద్యం విక్రయిస్తే 89192 58677 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు.

ఆరుగురి అరెస్ట్

తుగ్గలి: మండల పరిధిలోని రామాపురం వద్ద పొట్టేళ్ల పందేలు ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు శుక్రవారం జొన్నగిరి ఎస్‌ఐ రామాంజినేయులు తెలిపారు. గ్రామ సమీపంలోని వంకలో పొట్టేళ్ల పందేలు ఆడుతున్నారన్న సమాచారం మేరకు పోలీసు సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో బొలవానిపల్లికి చెందిన ముగ్గురు, పామిడి మండలం నెమళ్లపల్లికి చెందిన ఇద్దరు, గుంతకల్లు మండలం ములకలపెంటకు చెందిన ఒకరిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుంచి రెండు పొట్టేళ్లు, రూ.5 వేల నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.

లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించండి

ఎమ్మిగనూరురూరల్: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు తమ జీవన ప్రమాణాల లైఫ్ సర్టిఫికెట్‌ను ఈ నెలాఖరు వరకు ట్రెజరీలో ఇవ్వవచ్చని ప్రభుత్వ పెన్షనర్ల సంఘం యూనియన్ తాలుకా కార్యదర్శి శ్రీనివాసులు శుక్రవారం సాయంత్రం ఓ ప్రకటనలో తెలిపారు. లైఫ్ సర్టిఫికెట్ సమర్పణ గడువు ఫిబ్రవరి 28తో ముగిసిందని, ఇంతవరకు లైఫ్ సర్టిఫికెట్స్ ఇవ్వని వారు ఈ నెలాఖరులోపు పూర్తి వివరాలతో ట్రెజరీ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ

చిప్పగిరి: మండలంలోని ఆయా గ్రామాలలో నూతన ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. నంచర్ల గ్రామంలో ఆరోగ్యశ్రీ కార్డులను గ్రామ వాలంటీర్లు లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పంపిణీ చేస్తున్నారు. ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పరిధిని రూ.25 లక్షల వరకు పెంచిందని, ప్రజలు అనారోగ్యం పాలైతే ఆ మేరకు కార్పొరేట్ ఆస్పత్రులో వైద్యసేవలు ఉచితంగా పొందవచ్చని వివరిస్తున్నారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఓటీఎస్‌తో ఆస్తిపన్నుపై వడ్డీ మాఫీ

ఎమ్మిగనూరుటౌన్: మున్సిపాలిటీలో ఆస్తి పన్ను బకాయిలపై వన్ టైం సెటిల్‌మెంట్ విధానం ద్వారా వడ్డీని మాఫీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ ప్రజలు ఇంటి, ఖాళీ స్థలాలపై చెల్లించవలసిన పన్ను బకాయిలను ఈ ఆర్థిక సంవత్సరంతో సహా ఒకేసారి మార్చి 31వ తేదీలోగా చెల్లిస్తే వాటిపై వడ్డీ మాఫీ చేస్తామన్నారు. వడ్డీ మాఫీని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పన్ను చెల్లించాలని కోరారు.

వైభవంగా కలశ ప్రతిష్ట



కలశాలను ఊరేగింపుగా తీసుకెళుతున్న భక్తులు

పత్తికొండ రూరల్: పత్తికొండలోని గ్రామ దేవతలైన అంకాలమ్మ, బంగారమ్మ ఆలయ ముఖద్వారంపై శుక్రవారం కలశ ప్రతిష్ట మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ నెల 13న గ్రామ దేవర పురస్కరించుకొని రూ.30 వేల విలువైన మూడు కలశాలను పట్టణానికి చెందిన రామాంజనేయులు, ఈశ్వరమ్మ దంపతులు ఆలయానికి విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా శుక్రవారం ఉదయం వేద పండితుల ఆధ్వర్యంలో అర్చకుడు బ్రహ్మయ్య ఆచారి శాస్త్రోక్తంగా కలశపూజ నిర్వహించారు. అమ్మవార్లకు పంచామృత అభిషేకాలు, పసుపు, కుంకుమార్చనలతో పూజలు చేశారు. అనంతరం ముఖద్వారంపై నూతన కలశాలను ప్రతిష్టించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు ఎల్లారెడ్డి, తప్పెట నాగన్న, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.